క్లుప్తంగా

ఇసుక డంపు సీజ్



ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడలో నిల్వచేసిన ఇసుక డంపును సీజ్ చేసినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. మామిడిమాడ సమీపంలో సుమారు 42 ట్రాక్టర్ల ఇసుకను డంపు చేసి ఉండటంతో మంగళవారం వెళ్లి పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలించి, డంపు చేశారని గుర్తించి ఇసుక డంపును సీజ్ చేసి పంచాయతీ కార్యదర్శి, కానిస్టేబుల్‌తో పాటు గ్రామ వీఆర్‌ఓకు అప్పగించినట్లు ఆమె తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను డంపు చేసినా, తరలించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి



వీపనగండ్ల: వేసవిలో అధికమవుతున్న ఎండలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి వైద్య సిబ్బందితో పాటు పలువురు ప్రజలకు అవగాహన కల్పించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే గొడుగు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



ఆత్మకూర్: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే వైద్యులు నిస్సార్ అహ్మద్, శంసూనీసా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం ఆరేళ్లలోపు చిన్నారుల్లో కంటి, మానసిక సమస్యలు గుర్తించేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు అందించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు రఘునందన్, అంగన్‌వాడీ టీచర్లు రాణి, రఫీఖాభాను, విద్యార్థులు ఉన్నారు.

రేషన్‌షాపుల్లో ప్రధాని ఫొటో పెట్టాలి



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు తామే రేషన్ బియ్యం ఇస్తున్నామంటూ మోసం చేస్తుందని, రేషన్‌షాపుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటోను ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషకు అందజేశారు. రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు ఇస్తున్న ఆరు కేజీల సన్నబియ్యంలో ఐదు కేజీలు కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌భూపాల్, మనోహర్‌గౌడ్, అంజనేయులు, వెంకటేష్, రాము, మాసన్న తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల గ్రామంలో కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు సన్న బియ్యం పథకాన్ని సోమవారం తహసీల్దార్ వరలక్ష్మి, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక అధికారి నర్సింహ ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్‌దారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా అందజేయాలని ఆదేశించారు. కల్యాణలక్ష్మి చెక్కుల ద్వారా అందిస్తున్న ఆర్థికసాయం పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, నారాయణరెడ్డి, ఇంద్రకంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పడకేసిన 'పంచాయతీ' పాలన

- సర్పంచ్‌లు లేక అస్తవ్యస్తం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- లోపించిన పారిశుద్ధ్యం



చెల్లపాడులో..



బెక్కెం గ్రామంలో డ్రైయినేజీ లేకపోవడంతో నిలిచిన మురుగు



లక్ష్మీపల్లిలో..

చిన్నంబావి: పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఏడాది దాటినా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ముందుకు రావట్లేదు. గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించి పాలన కొనసాగిస్తున్నారు. కానీ వారు గ్రామాల్లో పర్యటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో డ్రైయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. గ్రామ పంచాయతీలకు పన్నులు చెల్లిస్తున్నా మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు చొరవ చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేధిస్తున్న నిధుల సమస్య

ప్రభుత్వం నుంచి గ్రాంటు విడుదల కాకపోవడంతో పంచాయతీల్లో నిధులు లేక ప్రత్యేకాధికారులు పల్లెల వైపు కన్నెత్తి చూడటం లేదు. పంచాయతీ కార్యదర్శులు ఉన్న కొద్దిపాటి నిధులతో నెట్టుకొస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పంచాయతీ కార్యదర్శులే ఖర్చులు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. డ్రైయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు ఇళ్ల మధ్య నిలుస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ కారణంగా దోమల బెడద పెరిగి చిన్న పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు.

మండలంలో పరిస్థితి

మండలంలోని వెలగొండ, మియాపూర్, బెక్కెం, పెద్దమారు, కొప్పునూరు, లక్ష్మీపల్లి, చెల్లపాడు గ్రామాల్లో డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా మురుగు నీరు చేరుతోంది. సర్పంచ్‌లు లేకపోవడంతో సమస్య గురించి ఎవరిని అడగాలో తెలియక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికారుల పర్యటనలు, ఎమ్మెల్యేల కార్యక్రమాల్లో తప్పితే గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. గ్రామస్థాయిలో పర్యవేక్షించాల్సిన పంచాయతీ సిబ్బంది సైతం కొంత అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

డ్రైయినేజీలను సరిచేయాలి



మండలంలోని పలు గ్రామాల్లో డ్రైయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు రోడ్లపైనే పారుతుంది. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పంచాయతీ సిబ్బంది ఎవరికి వారు యమునా తీరే అన్న చందంగా ప్రవర్తిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి.

– కిరణ్‌కుమార్, చిన్నంబావి

తప్పని ఇబ్బందులు



వర్షాకాలంలో వర్షాలతో డ్రైనేజీలు నిండి మురుగునీటితో ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు వేసవి వచ్చినా అదే పరిస్థితి ఏర్పడుతుంది. మురుగునీరు శుభ్రం చేయాలని కోరుతున్నా పట్టించుకునే వారు లేరు. మంత్రి జూపల్లి దృష్టి సారించి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి.

– స్వాములు, చిన్నంబావి

సర్కారు బడుల్లోనే మెరుగైన విద్య



వజ్రోత్సవంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి.. మెరుగైన విద్య అందిస్తున్నట్లు జిల్లా పరీక్షల విభాగం సమన్వయ అధికారి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వజ్రోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 75 ఏళ్ల క్రితం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాఠశాల పూర్వ విద్యార్థులతో పాటు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు పాఠశాల వజ్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకొని చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అన్నారు. అనంతరం పాఠశాల ప్రారంభం నాటి నేటి వరకు పనిచేసిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గ్రామ విద్యారంగం, గ్రామ చరిత్రను క్రోడీకరిస్తూ తెలుగు పండిత్ డా.భైరోజు శ్యాంసుందర్ రచించిన 'ఉషస్సు' వజ్రోత్సవ సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంఓ మహానంది, ఎంఈఓ శ్రీనివాసులు, సెక్టోరియల్ అధికారులు యుగంధర్, శేఖర్, నారాయణమ్మ, జీసీడీఓ శుభలక్ష్మి, పాఠశాల జీహెచ్‌ఎం సేక్యానాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు నిందితులకు రిమాండ్



నిందితులను ప్రవేశపెట్టిన సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్

ఆత్మకూర్: డబ్బుల వ్యవహారంలో యువకుడిని కిడ్నాప్ చేసిన నిందితులను అదుపులోకి తీసుకున్నామని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్‌లు తెలిపారు. సోమవారం రాత్రి వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్‌కు చెందిన నాగమ్మ కుటుంబంతో కలిసి ఆత్మకూర్‌లో నివాసముంటుందన్నారు. నాగమ్మ గుంతకల్‌కు చెందిన తన సమీప బంధువులైన అంజమ్మ వద్ద రూ.4 లక్షలు అప్పుగా మరో బంధువైన చంద్రకళకు ఇప్పిచారని తెలిపారు. చంద్రకళ తీసుకున్న డబ్బులు ఎగ్గొట్టడంతో ఆ డబ్బులను కట్టాలని రెండేళ్లుగా అడుగుతున్నా స్పందించక పోవడంతో ఈ నెల 3న అర్ధరాత్రి నాగమ్మ కుమారుడైన వెంకటేష్‌ను గుంతకల్‌కు చెందిన గంగన్న, అంజమ్మ, మహేందర్, ఎంకటన్న కలిసి ఎత్తుకెళ్లి నిర్బంధించి చిత్రహింసలకు గురి చేశారని వివరించారు. వెంకటేష్ భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, కిడ్నాప్ చేసేందుకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆత్మకూర్: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారని కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మూలమళ్లలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు విషయంలో రైతులకు అన్యాయం జరుగకుండా, తుకాల్లో మోసం చేయకుండా చూడాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సహదేవుడు, సుధాకర్, యుగంధర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బాబు, లక్ష్మణ్, గజేందర్‌రెడ్డి, కుమార్, రాములు, శేఖర్, నరేష్, రైతులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడి మృతికి సంతాపం



గోపాల్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ రేవల్లి మండల అధ్యక్షుడు రఘురామారావు (75) సోమవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మరణించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రఘురామారావు మరణించాడనే విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం సొంత గ్రామంలో జరిగే అంత్యక్రియల్లో వారు పాల్గొంటారని సమాచారం.

అన్న కుమారుడిపై దాడి: కేసు నమోదు

ఖిల్లాఘనపురం: కుటుంబ పెద్ద సంరక్షణ విషయంలో గొడవ పెట్టుకుని అన్న కుమారుడిపై దాడి చేసిన బాబాయిలు, చిన్నమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అప్పారెడ్డిపల్లికి చెందిన బుర్రగల్ల అంజలమ్మకు ఐదుగురు కుమారులు. పెద్ద కుమారుడు మృతి చెందడంతో ఆయన కుమారుడు బుర్రగల్ల శివ, మిగతా నలుగురు కుమారులు గ్రామంలోనే వేరువేరుగా జీవిస్తున్నారు. అంజలమ్మ సంరక్షణ విషయంలో బుర్రగల్ల శివకు అతడి బాబాయిలు కృష్ణయ్య, రాములు, శివుడి మధ్య గొడవ జరిగింది. పెద్దల సమక్షంలో మాట్లాడుకుందామని అందరూ అనుకున్నారు. కానీ సోమవారం రాత్రి 7:30 గంటల సమయంలో ముగ్గురు బాబాయిలతో పాటుగా వారి భార్యలు శ్యామలమ్మ, అలివేలు, విజయలక్ష్మి కలిసి శివ ఇంటి మీదికి వెళ్లి అతడితో పాటు భార్యను బూతులు తిట్టడంతో పాటుగా కట్టెలతో దాడి చేశారు. దాడిలో శివకు రక్తగాయాలయ్యాయి. ఈ విషయమై బాధితుడు మంగళవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



ఏదులలో విద్యార్థులకు బహుమతులు అందించిన సుఖేందర్‌రెడ్డి

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికవగా.. వారిని, ఉపాధ్యాయ బృందాన్ని సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించి అభినందించారు. పాఠశాలకు చెందిన సాయిప్రణీత (బాల్‌నగర్), రక్షిత(బుద్దారం), దివ్యశ్రీ (పెద్దమందడి) పాఠశాలలకు 5వ తరగతికి ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం ప్రత్యేక తరగతుల తీసుకోవడం ద్వారానే విజయం సాధించినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎంగా వెంకటేష్‌యాదవ్, హెచ్‌ఎం ఖాసీం, ఉపాధ్యాయురాలు రాణిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో గ్రామ పెద్దలు గోపాల్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, కొండలయ్య, లక్ష్మణ్, నాగేష్, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

గోపాల్‌పేట: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సుఖేందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఏదుల మండల కేంద్రంలో విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో రైటింగ్ స్కిల్ టెస్టు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువు, ఆటలపై దృష్టి సారించాలని, సెల్‌ఫోన్లకు వీలైనంత దూరంగా ఉండాలని సూచించారు. ప్రతిభ చీర్కపల్లికి చెందిన ముగ్గురు, ఏదులకు చెందిన ఇద్దరు, ముత్తిరెడ్డిపల్లికి చెందిన ఒకరు, సింగాయిపల్లి ఒకరు, గుండవాల్యాతండాకు చెందిన ఒకరికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మబ్బురాములు, మంగ, చంద్రమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో..



వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో..

వీపనగండ్ల: గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో సాంఘిక శాస్త్రంలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో శంకర్‌ప్రేమ్‌నాయుడు, కృష్ణానాయక్, శ్రీనివాస్‌రెడ్డిలు అందజేశారు. చరణ్‌తేజ, అఖిల, శివ, శ్రీకాంత్ టెన్ జీపీఏ సాధించారు. కార్యక్రమంలో గెజిటెడ్ హెడ్ మాస్టర్ భానుప్రకాష్, ఉపాధ్యాయులు మహేష్, శ్రీనివాసులు, హేమలత, మైపాల్‌రెడ్డి, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవింద్‌రావు

పాన్‌గల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, ఏపీఓ కుర్మయ్య ఉపాధి సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనులు చేపట్టని గ్రామాల్లో ప్రారంభించాలని, ఎస్సీ, ఎస్టీ రైతుల పొలాల్లో చదును చేయడం, గుట్టల చుట్టు కందకాలు, ఫాంపండ్, కొత్త కుంటలు, రైతుల పొలాలకు మట్టి రోడ్లు వంటి పనులు చేపట్టాలన్నారు. అన్ని నర్సరీల్లో వంద శాతం మొక్కలు పెంచాలని, మొక్కలను ఎండ నుంచి కాపాడటం కోసం గ్రీన్ నెట్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల వారీగా చేపపడుతున్న పనులు, హాజరవుతున్న కూలీలపై ఆరా తీశారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈసీ అంజన్‌రెడ్డి, టీఏలు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతుల ప్రోత్సాహానికే బండలాగుడు పోటీలు



పూజలు నిర్వహించి బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న కొత్తకాపు శివసేనారెడ్డి

వనపర్తి రూరల్: ఎలాంటి బెట్టింగులు లేకుండా రైతుల ఉత్సాహం కోసమే వృషభ రాజముల పోటీలు నిర్వహిస్తున్నారని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెద్దగూడెం గ్రామంలో అంతరాష్ట్ర వృషభ రాజాల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామ నవమి ముగింపు సందర్భంగా గ్రామంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో చిన్నంబావి మండలంలోని పెద్దదగడకు చెందిన గోపాలక్రిష్ణ ఎద్దులు 1212.3 ఫీట్లు లాగి మొదటి బహుమతిని గెలువగా రూ.40 వేల నగదు, మెమోంటోను అందజేశారు. అలాగే 2, 3, 4 బహుమతులు పెబ్బేరు గ్రామానికి చెందిన బాలరాజు ఎద్దులు, పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామానికి చెందిన మేకల ఆంజనేయులు ఎద్దులు, గద్వాల జిల్లాకు చెందిన వినిల్ రాయుడు ఎద్దుల జతలు 1,200 అడుగులు లాగి సమానంగా నిలిచారు. వీరికి రూ.20 వేలు సమానంగా ముగ్గురికి అందజేశారు. ఐదో బహుమతి పెబ్బేరు గ్రామానికి చెందిన ఎం చరణ్ ఎద్దులు 361 అడుగులు లాగి రూ.5 వేల బహుమతి గెలుచుకున్నారు.

ముగిసిన కోదండరామస్వామి ఉత్సవాలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెంలో కోదండ రామస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహోత్సవాలు సోమవారం ముగిశాయని అర్చకులు రమణశర్మ తెలిపారు. చివరిరోజు ఉదయం వేద పండితుల మంత్రోచ్చరణలతో గుడిలో సీతాసమేతుడు శ్రీరాముడికి చక్రస్నానం చేయించారు. స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండయ్య, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నామని ఆ పార్టీ మండల కార్యదర్శి కె.రాజన్న తెలిపారు. ఈనెల 8న జిల్లా కేంద్రాల్లో చేపట్టే నిరసనలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఒకవైపు రైతులు ఎమ్మెస్పీ చట్టం కోసం, కార్మికులు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ ల రద్దు, కార్మికుల భద్రత కోసం వేతనాల కోసం ఉద్యమిసుంటే పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులపై నిరంకుశంగా వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాజు, సామేలు, కురుమన్న, మస్తమని, ప్రేమరత్నం, ఆనంద్, ఏసన్న పాల్గొన్నారు.

బుద్దారం గండి సమీపంలో రోడ్డు ప్రమాదం




బుద్దారం సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన శేఖర్, జయమ్మ దంపతులు

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గండి సమీపంలో ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు గాయాలపాలయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. బుద్దారం గ్రామానికి చెందిన శేఖర్, జయమ్మ భార్యభర్తలు. సోమవారం వీరు బిజినపల్లి వైపు నుంచి రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో బుద్దారం గ్రామానికి వస్తున్నారు. అదే సమయంలో బుద్దారం గండి నుంచి బుద్దారం గ్రామం వైపు కట్టెలలోడుతో ట్రాక్టర్ వెళ్తోంది. బుద్దారం ఎత్తుమిట్ట నుంచి గుడి మధ్యలో ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న శేఖర్, జయమ్మ తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు, పోలీసులు క్షతగాత్రులను వనపర్తి ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీకొని..

వనపర్తి రూరల్: రెండు బైకులు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు, ఒకరికి స్వల్ప గాయాలయిన ఘటన సోమవారం మండలంలోని కడుకుంట్ల, మెంటిపల్లి గ్రామాల మధ్య చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కడుకుంట్ల గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌గౌడ్, శివానంద్‌గౌడ్, శ్రీకాంతు యాదవ్, స్వామి యాదవ్ వీరు రెండు బైక్‌లపై వస్తూ ఢీకొట్టుకున్నారు. దీంతో బైక్‌పై నుంచి కిందపడి ముగ్గురు వ్యక్తులు పవన్‌కుమార్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, స్వామియాదవ్‌కు తీవ్రగాయాలు కాగా.. శివానంద్‌గౌడ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కడుకుంట్ల 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ ఖాదర్‌పాష, డ్రైవర్ పసీయోద్దీన్ వనపర్తి ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. వైద్యుల సూచనల మేరకు శ్రీకాంత్‌యాదవ్‌ను హైదరాబాద్ నిమ్స్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



పాన్‌గల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ అన్నారు. సోమవారం మండలంలోని దొండాయిపల్లి, కొత్తపేట గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదల కడుపు నింపేందుకు రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్ నాయుడు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, మాజీ సర్పంచ్ వెంకటయ్య యాదవ్, తిరుపతయ్య సాగర్, లోకారెడ్డి, తిరుమల్ యాదవ్, కిరణ్ సాగర్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు రుణ సదుపాయం

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుద్యోగ యువతి, యువకులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ శశిధర్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో 58 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఆధార్, రేషన్, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తులను నేరుగా కార్యాలయంలో అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు ముజమ్మీల్, మక్బూల్, నరేందర్, షోయబ్, సిబ్బంది పాల్గొన్నారు.